క్లుప్తంగా

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోండి

పెడన: రైతు భరోసా పథకానికి అర్హులైన రైతులు సమీపంలోని ఆర్‌బీకేలో మే 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పెడన వ్యవసాయ శాఖాధికారి జీవీ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వరి పంట ఎవరి పేరు మీద ఉందో వారు ఇప్పటి వరకు పథకం పొందని వారుంటే తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పంట పొలాలు కొనుగోలు చేసి మార్పులు, చేర్పులు చేసుకున్న వారుంటే సంబంధిత డాక్యుమెంట్లతో ఆర్‌బీకే సిబ్బందిని సంప్రదించాలన్నారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

పెడన: గూడూరు రోడ్డులోని శివార్జున కోచింగ్ సెంటర్‌లో చేతి రాతపై ఉచిత శిక్షణ తరగతులు మే 2వ తేదీ నుంచి జరుగుతాయని కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు కె. సాంబశివరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషోద్యమ సమాఖ్య కృష్ణా జిల్లా ఆధ్వర్యంలో ప్రముఖ చేతిరాత నిపుణుడు అప్పికొండ పోతురాజు ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తారని చెప్పారు. ఇతర వివరాలకు సెల్: 99664 19220, 89776 25076 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఘనంగా స్వామి వారి కల్యాణోత్సవం

మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెం–నంగేగడ్డ మార్గమధ్యంలోని శివనాగరాజస్వామి ఆలయం 32వ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త నిజాంపట్నం నరసింహ మూర్తి పర్యవేక్షణలో విశేష పూజలు జరిగాయి. తొలుత సమీప గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిగింది.

వీరబ్రహ్మేంద్రుని ఆరాధనోత్సవం

నాగాయలంక: స్థానిక మర్రిరాజా పోతురాజు వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి ఆరాధనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ భవిరి సుధాకర్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు జరిగాయి. దేవదాయ శాఖ టెక్నికల్ అధికారి భవిరి రవి సతీ సమేతంగా పూజ చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

9న ఆలయ భూములకు కౌలు వేలం

గూడూరు: మల్లవోలులోని చెన్నకేశవ స్వామి ఆలయ భూములకు కౌలు వేలం పాటలు మే 9వ తేదీన నిర్వహిస్తామని ఆలయ మేనేజర్ టీవీ మోహన్‌రావు తెలిపారు. ఆలయానికి సంబంధించి 7.24 ఎకరాల వ్యవసాయ భూమి ఉందని చెప్పారు. తొమ్మిదో తేదీ ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ మచిలీపట్నం వారి ఆధ్వర్యంలో టెండర్ కం కౌలు వేలం పాట జరుగుతుందన్నారు. ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని కోరారు.

చల్లపల్లిలో కుండపోత వర్షం

చల్లపల్లి: చల్లపల్లిలో ఆదివారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. ప్రధాన, అంతర్గత రహదారులు, కూడళ్లు జలమయమయ్యాయి. డ్రెయినేజీల్లో మురుగునీరు రోడ్లపై ప్రవహించింది.

వర్షంతో చల్లబడిన వాతావరణం

మోపిదేవి: వరుసగా రాకతో వాతావరణం చల్లబడింది. గత మూడు రోజులుగా ఎండ లతో, ఉక్కపోతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు.

13 మంది జూదరుల అరెస్ట్

పెడన: పట్టణంలోని మారుతీ సినిమా థియేటర్‌లో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నాగరాజు సిబ్బందితో కలిసి ఆదివారం దాడి చేశారు. 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.32,790 నగదు, పది సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

మృతుని కుటుంబానికి సాయం

మచిలీపట్నంటౌన్: 38వ డివిజన్ గొడుగుపేటకు చెందిన పింఛనుదారుడు మామిడి నారాయణ ఇటీవల మృతి చెందారు. తోటి పింఛనుదారులు ఒక్కొక్కరు రూ. 100 చొప్పున సేకరించిన రూ. 20 వేలను మృతుడి భార్య సరోజకు ఆదివారం మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదాతో కలిసి పింఛనుదారులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇదే డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ శ్రీకాకోళ్లు నరసింహస్వామి స్నేహితుడు రమేష్ రూ. 1000 సరోజకు అందజేశారు. ఆర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళ్లు రేణుకారాణి, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

లక్ష్మణబాబు మృతికి సంతాపం

గూడూరు: గూడూరు మాజీ ఎంపీపీ వర్ల లక్ష్మణబాబు మృతి తీరని లోటని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఇటీవల మృతిచెందిన వర్ల లక్ష్మణ బాబు సంస్మరణ సభ ఆదివారం కప్పలదొడ్డిలో నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ఎంపీపీగా గూడూరు మండల అభివృద్ధికి లక్ష్మణ్ బాబు విశేష కృషి చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేశారని కొనియాడారు. ఎంపీపీ సంగా మధు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గోపిశెట్టి రవి, వర్ల రాంబాబు, ఎర్కల నాగరాజు, పిరుబోట్ మధు, మోటేపల్లి రత్నారావు తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులతో వైద్య సేవలు

- ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో సమకూరిన వసతులు
- ప్రారంభానికి సిద్ధంగా సామాజిక ఆరోగ్య కేంద్రం
- వైద్య పరికరాలు, స్కానింగ్ యంత్రాల ఏర్పాటు
- రూ.50 లక్షలతో జగనన్న ప్రాణవాయువు సిద్ధం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం



సిద్ధంగా ఉన్న జగనన్న ప్రాణవాయువు కేంద్రం

అవనిగడ్డ: ఒకప్పుడు అది పేరుకే ప్రభుత్వ ఏరియా వైద్యశాల. సరైన వైద్య పరికరాలు, స్కానింగ్ యంత్రాలు లేవు. సరిపడినంత మంది వైద్యులు ఉండే వారు కాదు. కరెంట్ పోతే కొవ్వొత్తులే దిక్కు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అవనిగడ్డ ఏరియా వైద్యశాలకు సదుపాయాలు సమకూరుతున్నాయి. అత్యవసర సమయాల్లో ఆక్సిజన్ కోసం జగనన్న ప్రాణవాయువు కేంద్రం సిద్ధమైంది. ప్రజలకు గతంలో కంటే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నారు.

రూ.4.41 కోట్లతో పలు అభివృద్ధి పనులు..

బందరు ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో అవనిగడ్డ ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.4.41 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగాయి. రూ.3.20 కోట్లతో నిర్మించిన రెండస్తుల సామాజిక ఆరోగ్య కేంద్రం భవనం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంది. కోవిడ్ సమయంలో అవనిగడ్డ ఏరియా వైద్యశాలలో ఏర్పాటు చేసిన కోవిడ్ సెంటర్ ఎందరో ప్రాణాలను కాపాడింది. భవిష్యత్‌లో ఎలాంటి పరిస్థితి అయినా ఎదుర్కొనేలా వైద్యశాల ప్రాంగణంలో నిముషానికి 500 లీటర్ల ఆక్సిజన్‌ను తయారు చేసే జగనన్న ప్రాణవాయువు కేంద్రాన్ని రూ. 50 లక్షల వ్యయంతో నిర్మించగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది.

అధునాతన స్కానింగ్, యంత్ర పరికరాల ఏర్పాటు..

ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవతో ఏరియా వైద్యశాలలో అధునాతన వైద్య యంత్ర పరికరాలు ఏర్పాటు చేశారు. రూ.71 లక్షల కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులతో వైద్యశాలలో అధునాతన స్కానింగ్ మెషిన్, ఐసీయూ బెడ్స్, ఈసీజీ యంత్ర పరికరం, మల్టీపారా మానిటర్స్, సెల్ కౌంటర్ ఫుల్లీ ఆటోమేటిక్ రక్త పరీక్షా కేంద్రం, మొబైల్ వ్యాన్ వంటి వాటిని సమకూర్చారు.

పూర్తిస్థాయిలో వైద్యుల పోస్టుల భర్తీ

స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ప్రతిరోజూ 300 వరకు ఔట్ పేషెంట్లు, 30 నుంచి 50 వరకు ఇన్‌పేషెంట్లకు వైద్యసేవలు అందిస్తున్నారు. గతంలో చాలా తక్కువ మంది వైద్యులు ఉండటంతో అరకొరగానే వైద్యసేవలు అందేవి. నేడు పూర్తిస్థాయిలో అన్ని విభాగాల్లో వైద్యుల పోస్టులు భర్తీ అయ్యాయి. ప్రస్తుతం జనరల్–1, డెంటిస్ట్–1, ఎనస్థీషియా–1, గైనకాలజిస్ట్–2, ఈఎన్‌టీ–1, ఆర్థో–1, పీడియాట్రిక్–1, నేత్ర వైద్యులు–1 అందుబాటులో ఉన్నారు.

అందుబాటులో వైద్యులు



అన్ని విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రజాప్రతినిధుల సహకారంతో వైద్యశాలకు పలు అధునాతన యంత్ర పరికరాలు సమకూరాయి. పాముకాటు, కుక్క కాటు మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంటున్నాయి. ప్రజలు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం. జయకుమార్, సూపరింటెండెంట్, అవనిగడ్డ ఏరియా ఆస్పత్రి

వైద్యసేవలు బాగున్నాయి

టైఫాయిడ్ జ్వరం వచ్చి మూడు రోజుల కిందట వైద్యశాలలో చేరా. డాక్టర్లు, నర్సులు వచ్చి బాగా చూస్తున్నారు. భోజనం కూడా పెడుతున్నారు. ఆదే నేను ప్రైవేటు వైద్యశాలలో చేరితే ఐదారు వేలు అయి పోయేవి.

– బర్మా వెంకటేశ్వరమ్మ, ఇన్‌పేషెంట్, బర్రంకుల

గతంలో కరెంట్ పోతే ఇబ్బందులు పడేవారు. అధునాతన జనరేటర్‌ను ఏర్పాటు చేయడంతో రోగులు, వైద్యులు పడే ఇబ్బందులు తొలగిపోయాయి.

ఇంధన సంరక్షణపై అవగాహన ర్యాలీ



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న ఎల్‌పీజీ డీలర్లు

మచిలీపట్నంటౌన్: ఇంధన సంరక్షణ, పర్యావరణ పరిరక్షణపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హిందుస్తాన్ పెట్రోలియం లిమిటెడ్ జిల్లా సేల్స్ ఆఫీసర్ బి. రాజశేఖర్ అన్నారు. స్థానిక కోనేరు సెంటర్‌లో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సైకిల్ ర్యాలీని జెండా ఊపి ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు తక్కువ దూరం ప్రయాణానికి సైకిల్‌ను వినియోగించడం వల్ల పెట్రోల్ ఉత్పత్తులను ఆదా చేయవచ్చని చెప్పారు. సైక్లింగ్ చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు దృఢత్వం పెరుగుతుందన్నారు. ప్రజలకు ఈ విషయాలపై అవగాహన కల్పించేందుకు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని వివరించారు. ఇందనాన్ని ఆదా చేయడమే కాకుండా మన ల్ని ఆరోగ్యకరంగా ఉంచుకునేందుకు సైక్లింగ్ దోహదం చేస్తుందని వివరించేందుకు తమ సంస్థ దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందని వివరించారు. ర్యాలీలో జిల్లాలోని పలు ఎల్‌పీజీ కంపెనీల డీలర్లు పాల్గొన్నారు.

వైభవంగా కన్యకాంబ జయంత్యుత్సవం



అమ్మవారికి అభిషేకాలు చేసిన సాంబశివరావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు



కోడూరులో అమ్మవారికి సారె తీసుకువెళ్తున్న ఆర్యవైశ్య మహిళలు



కన్యకా పరమేశ్వరి అమ్మవారు

నాగాయలంక: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వైభవంగా జరిగింది. ప్రత్యేక పూజలు, 108 లీటర్ల ఆవుపాలు, తేనె, విభూది, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు జరిగాయి. సహస్రనామ కుంకుమార్చన, విశేష పూజలు నిర్వహించారు. సామూహిక వాసవీమాత నామ పారాయణం చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పిట్టా సాంబశివరావు, దేవు సత్యనారాయణ, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు చిట్టా శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: ఆజాద్‌రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. నిజరూప అలంకారంతో దర్శనమిచ్చిన అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో పూజలు చేశారు. ఉదయం కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బాలభోగాలికలు అమ్మవారి భక్తిగీతాల పోటీలు జరిగాయి. సాయంత్రం మహిళా సంఘ బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి వీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ, కార్యదర్శి మోటమర్రి బాబాప్రసాద్, సభ్యులు సామా లక్ష్మీకాంతారావు, ఉడత్తు శ్రీనివాసరావు, బైసాని హయగ్రీవరావు పర్యవేక్షించారు.

ఆకట్టుకున్న ఆర్యవైశ్యుల శోభాయాత్ర

కోడూరు: వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలను కోడూరులో ఘనంగా నిర్వహించారు. దానాశెట్టి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలోని అమ్మవారి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆర్యవైశ్య మహిళలు తమ ఇళ్ల నుంచి అమ్మవారికి పట్టుచీర, పసుపు, కుంకుమ, గాజులు, సారెను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి సారెను సమర్పించి, లలిత సహస్రనామ పారాయణం నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు వైభవోపేతంగా జరిగాయి. సాయంత్రం ప్రత్యేక వాహనంపై వాసవి అమ్మవారి విగ్రహాన్ని కోడూరు వీధుల వెంట ఊరేగిస్తూ శోభాయాత్ర నిర్వహించారు. అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజజీయర్ స్వామీజీ శోభాయాత్రలో పాల్గొని భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. వివిధ రకాల వేషధారణలతో కళాకారులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వాసవీ కపుల్స్ క్లబ్, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు, ఆర్యవైశ్య ప్రముఖులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సమగ్రాభివృద్ధి కోసమే మాస్టర్‌ప్లాన్

ఎంయూడీఏ చైర్‌పర్సన్ దుర్గాభవాని



మాస్టర్ ప్లాన్ వివరాలు తెలుపుతున్న దుర్గాభవాని

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ప్రాంత సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎంయూడీఏ) ఆధ్వర్యంలో మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించామని సంస్థ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని తెలిపారు. ఎంయూడీఏ కార్యాలయంలో ఆదివారం ఆమె మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి చిన్నాపురం, భోగిరెడ్డిపల్లి, చల్లపల్లి, నడకుదురు మీదుగా ఘంటసాల వరకు రైల్వేలైన్‌ను ప్రతిపాదించామన్నారు. ఎంయూడీఏ పరిధి విస్తీర్ణం 425 చదరపు కిలోమీటర్లు ఉండగా దీని పరిధిలో 608 కిలోమీటర్ల పొడవున నూతన రహదారులను ప్రతిపాదించామని చెప్పారు. ఈ రహదారులన్నీ గ్రామాల్లోని జనావాస సమీపం నుంచి వెళతాయన్నారు. ఇండస్ట్రియల్ ఏరియా 4,098 హెక్టార్లలో, రెసిడెన్షియల్ ఏరియా 8,759 హెక్టార్లు, కమర్షియల్ ఏరియా 570 హెక్టార్లు, వ్యవసాయ, ఆక్వా సంబంధ భూములు 9,009 హెక్టార్లు, పార్కులు, ఖాళీస్థలాలు 670 హెక్టార్లు, పబ్లిక్, సెమీ పబ్లిక్ స్థలాలు 590 హెక్టార్లు, రహదారులకు 2 వేల హెక్టార్లు ప్రతిపాదించామని చెప్పారు. అగ్రికల్చర్ అండ్ ఆక్వా, రెసిడెన్షియల్, కమర్షియల్, పబ్లిక్, సెమీ పబ్లిక్, ఇండస్ట్రియల్, వాటర్‌బాడీస్, పబ్లిక్ యుటిలిటీస్, పార్కు అండ్ ఖాళీ స్థలాలు, కోస్టల్ రెగ్యులేషన్ జోన్, రూరల్ సంబంధిత వంటి వివిధ కేటగిరీలుగా విభజించి ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల అవసరాలకు తగ్గట్టుగా, పోర్టు నిర్మాణం అనంతరం రవాణా, పరిశ్రమల ఏర్పాటుకు ఇబ్బంది లేకుండా ఈ ప్రణాళికలను సిద్ధం చేశామని వివరించారు. ఎంయూడీఏ ప్లానింగ్ ఆఫీసర్ సృజన, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్ పాల్గొన్నారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందాలి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మందపాకలలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: గెలుపు ఓటములకు తావులేకుండా యువత క్రీడాస్ఫూర్తిని అలవర్చుకొని జీవితంలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. మందపాకల యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఓపెన్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఎమ్మెల్యే రమేష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. మందపాకల యూత్ సభ్యులు ప్రతి ఏటా వేసవిలో యువతను ఉత్సాహ పర్చేందుకు టోర్నమెంట్లు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు వివిధ గ్రామాల నుంచి 25 టీమ్‌లు వచ్చాయని, నాకౌట్ పద్ధతిలో పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. క్రికెట్ పోటీల్లో గెలిచిన టీమ్‌కు ప్రథమ బహుమతిగా రూ.30 వేల నగదు, ద్వితీయ బహుమతిగా రూ.20 వేలు నగదు ఇస్తామని చెప్పారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్, బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్‌కు నగదు బహుమతులు పాటు ప్రతి మ్యాచ్‌కి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి ప్రత్యేక బహుమతి ఇస్తామని వివరించారు. వైఎస్సార్ సీపీ మండల సచివాలయాల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, పార్టీ నేతలు, కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. ఆన్‌లైన్ చేయిస్తాం

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

అవనిగడ్డ: అవనిగడ్డ నియోజకవర్గంలో ఆఫ్ లైన్‌లో కొన్న ధాన్యం సొమ్ము రైతులకు వచ్చేలా చేయడం తన బాధ్యత అని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వరి కోతలు ప్రారంభమయ్యే సమయంలో మాండూస్ తుఫాన్, అకాల వర్షాలతో రైతులు ఆందోళన, హడావుడితో వరి కోత యంత్రాలతో కోసిన వరి పచ్చి ధాన్యం అప్పటికప్పుడు మిల్లులకు చేరేలా ఆఫ్ లైన్‌లో చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఆఫ్ లైన్‌లో ధాన్యం మిల్లులకు చేర్చిన రైతులు తమ జిరాక్స్‌లు తనకు అందజేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఆఫ్‌లైన్‌లో అమ్మిన ప్రతి బస్తా ధాన్యం సొమ్ము ఆన్‌లైన్ ద్వారా రైతులకు వచ్చేలా చేస్తామన్నారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని కోరారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రైతు విభాగం జోనల్ ఇంచార్జి కడవకొల్లు నరసింహారావు, నియోజకవర్గ ఆదివాసి ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామ బలిహరణ

కోడూరు: లింగారెడ్డిపాలెం బాలాత్రిపుర సుందరి సమేత గోకర్ణేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామ బలిహరణను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రత్యేక పల్లకీలో బలిహరణ స్వామి వారిని ఉంచి గ్రామంలో ఊరేగించారు. ఉదయం స్వామి వారి లింగాకారుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. బాలాత్రిపుర సుందరీ అమ్మవారికి మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. సోమవారం రాత్రికి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ వేదికలో స్వామివార్ల కల్యాణం జరుగుతుందని ఆలయ ఈఓ సుధాకర్ తెలిపారు. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, నాటకాల ప్రదర్శనలు ఉంటాయన్నారు.

ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి ఏర్పాటు చేస్తాం

పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చిన్నా

పెడన: ఆంధ్ర రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితిని ఏర్పాటు చేయనున్నామని మహత్మాగాంధీ సేవా పురస్కార గ్రహీత, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) అన్నారు. ఆదివారం స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలో జరిగిన ఆర్యవైశ్యుల సంఘ సభలో వాసవి మహిళా మండలి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పెడన కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితిని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోని ఆర్యవైశ్య సంఘ నాయకులను సంప్రదించి ప్రతి జిల్లా నుంచి 15 మంది చొప్పున కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. పరిరక్షణ సమితి ద్వారా నిరుపేదలైన ఆర్యవైశ్యులను ఆదుకుంటామని చెప్పారు. సమావేశంలో కొత్త ఫణిభూషణరావు, మామిడి వరప్రసాదరావు, మద్దుది నాగేశ్వరరావు, తమ్మన వెంకట సుబ్బారావు, నరసింహారావు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన మన్ కీ బాత్

కేంద్ర మాజీ మంత్రి పురందరేశ్వరి

మచిలీపట్నంటౌన్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న మన్ కీ బాత్ కార్యక్రమం చరిత్ర సృష్టించిందని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందరేశ్వరి అన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆమె గిలకలదిండి నుంచి పాల్గొన్నారు. బీజేపీ నియోజకవర్గ నాయకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఆదివారం 100వ ఎపిసోడ్‌లో ప్రధాని ప్రసంగించారన్నారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆల్ ఇండియా రేడియోలో మన్ కీ బాత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. గిలకలదిండిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న స్థానికులతో పలు విషయాలపై చర్చించారు. గిలకలదిండిలో మత్స్యకార కుటుంబాలకు చెందిన ప్రతినిధులతోనైన వారిని గుర్తించి ఈ సందర్భంగా ఆమె సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజారావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలాజీ, నాయకులు పాండురంగారావు, దూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: స్థానిక వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. నాగపుట్ట, నాగసులప్పి వృక్షం, పాంగళ్లాలు వద్ద భక్తుల రద్దీ కనిపించింది. భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షించారు. ఆలయ ఏసీ ఎస్‌ఎస్ చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. మద్దు శేషగిరిరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక ఎస్‌ఐ పద్మ మజ్జిగ వలివేంద్రాన్ని ఉదయం ప్రారంభించారు.

ఆర్టీసీ టిక్కెట్ల చోరీపై కేసు నమోదు

కోనేరుసెంటర్: గుర్తుతెలియని దుండగులు ఆర్టీసీ టిక్కెట్లను చోరీ చేశారు. టిక్కెట్లతో పాటు పెద్ద మొత్తంలో నగదును స్వాహా చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తే బి. శంకరయ్య ఈ నెల 27వ తేదీన హనుమకొండ నుంచి మచిలీపట్నం వచ్చే బస్సులో డ్యూటీకి వెళ్లాడు. 27వ బయలుదేరిన బస్సు 28వ తేదీ ఉదయం 9.30 గంటలకు మచిలీపట్నం చేరుకుంది. డ్యూటీ దిగిన శంకరయ్య మచిలీపట్నం డిపోలోని విశ్రాంతి గదిలోకి వెళ్లి నగదుతో పాటు టిక్కెట్లు ఉన్న బ్యాగును గదిలో భద్రపరిచి నిద్రలోకి జారుకున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో లేచి చూడగా బ్యాగుతో పాటు అందులో ఉన్న నగదు, టిక్కెట్లు మాయం అయ్యాయి. విషయాన్ని ఆర్టీసీ అధికారులకు చెప్పిన శంకరరావు తిరిగి హనుమకొండ వెళ్లిపోయాడు. అయితే హనుమకొండ ఆర్టీసీ అధికారులు జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయాలంటూ సూచించడంతో ఆదివారం మచిలీపట్నం వచ్చి జరిగిన ఘటనపై ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కృష్ణాపురం పాఠశాల వార్షికోత్సవం

కోడూరు: జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేశారని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాత్రి కృష్ణాపురం ఎంపీపీ పాఠశాల వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ టీవీఎం రామదాసు అధ్యక్షత వహించారు. వివిధ అంశాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ వరికూటి మాధవరావు, ఎంపీటీసీ తిమ్మన నాంచారయ్య, ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురంలో చోరీ

కోనేరుసెంటర్: తాళాలు పెట్టి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నాపురం గ్రామానికి చెందిన సంజారి రామేమల్లయ్యామరు దంపతులు ఏప్రిల్ 18వ తేదీన ఇంటికి తాళాలు పెట్టి షిర్డీ యాత్రకు వెళ్లారు. 30వ తేదీ ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. అనుమానంతో లోనికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాను పరిశీలించగా అందులోని 95 గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. క్లూస్‌టీం సిబ్బంది వేలిముద్రలు సేకరించింది కేసు నమోదు చేశారు.

వీఆర్వో వెంకటేశ్వరరావు మృతి

మోపిదేవిలంక(మోపిదేవి): మోపిదేవిలంకకు చెందిన వీఆర్వో బొక్కు వెంకటేశ్వరరావు (54) శనివారం రాత్రి మృతిచెందారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోగా పనిచేస్తూ వీఆర్వోగా పదోన్నతితో విజయవాడలోని రామలింగేశ్వర నగర్‌కు ఆయన బదిలీ అయ్యారు. అక్కడ పనిచేస్తూ మోపిదేవిలంకకు వచ్చిన ఆయన శనివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని రెవెన్యూ అధికారులు, స్థానిక నాయకులు సందర్శించి నివాళులర్పించారు. మృతుని భార్య పద్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

శ్రీమన్నారాయణుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కోడూరు: ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి పుష్కర బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణకర్త త్రిదండి అష్టాక్షరి సంపత్‌కుమార రామానుజ జీయర్ స్వామీజీ పర్యవేక్షణలో వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్మాణం జరిగి 12 సంవత్సరాలు పూర్తి కావడంతో ఈ ఏడాది పుష్కర బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టినట్లు అష్టాక్షరి స్వామీజీ చెప్పారు.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

మచిలీపట్నంటౌన్: రాజుపేట పెద్దవీధి రామాలయం వద్ద ఉన్న విఘ్నేశ్వర సరస్వతి సమేత రామాలయాన్ని పునర్నిర్మించారు. ఆలయంలో ఆదివారం స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ జవ్వాది రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని అందజేశారు.